క్లుప్తంగా

మినీ గురుకులంలో ప్రవేశాలకు ఆహ్వానం

భద్రాచలంటౌన్: పినపాక మండలంలోని మినీ గురుకులం బాలికల విద్యాలయంలో 1, 2వ తరగతిలో మిగిలిన సీట్ల ప్రవేశం కోసం అర్హత ఉన్న స్థానిక గిరిజన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు మంగళవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ముందుగా స్థానిక విద్యార్థినులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, తరువాత సమీప మండలాల వారికి రెండో ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. అర్హత కలిగిన వారు రెండు పాస్‌ఫొటోలు, అభ్యర్థి సంతకం, ఆధార్ కార్డు, పుట్టిన తేదీ, మొబైల్ నంబర్‌తో ఈ నెల 7 నుంచి మే 4 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థినుల ఎంపిక లాటరీ పద్ధతి ద్వారా ఉంటుందని పీఓ వెల్లడించారు.

నేడు కరెంటు కోత

గుండాల: విద్యుత్ లైన్ మరమ్మతులు కారణంగా బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కరెంటు కోత ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ సురేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇల్లెందు నుంచి మామకన్ను సబ్ స్టేషన్ వరకు 33/11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులు జరుగుతాయని తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో కోత ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలోని జాతీయ రహదారిపై ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే మార్గంలో మంగళవారం రోడ్డు ప్రమాదం జరగగా.. ఇద్దరు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. మద్దుకూరు గ్రామానికి చెందిన పత్తిపాక వెంకటేశ్వర్లు మరో వ్యక్తితో కలిసి తహసీల్దార్ కార్యాలయం నుంచి జాతీయ రహదారిపైకి ద్విచక్రవాహనంపైకి వస్తున్నాడు. ఈ క్రమంలో విజయవాడ నుంచి కొత్తగూడెం వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకుంది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లు రెండు కాళ్ళు విరిగాయి. మరోవ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును పోలీసులు స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు.

యాత్రకు తరలిరండి

చర్ల: ఏప్రిల్ 14న చర్ల నుంచి ప్రారంభమయ్యే సీపీఐ ప్రజాపోరుయాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రావులపల్లి రాంప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం చర్లలో పార్టీ మండల కార్యదర్శి నూపా పోతయ్య అధ్యక్షతన జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టేందుకు ఈ ప్రజాచైతన్య పోరు యాత్రను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. యాత్రలో భాగంగా చర్లలో భారీ బహిరంగ సభ ఉంటుందని, అటు తరువాత చర్ల నుంచి భారీ ర్యాలీ ప్రారంభమై అన్ని గ్రామాల్లో పర్యటించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు కల్లూరి వెంకటేశ్వరావు, జిల్లా సమితి సభ్యుడు అడ్డగర్ల తాతాజీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

గుండాల: మండలంలోని బాటన్న నగర్ పాఠశాల విద్యార్థులకు చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం పట్టణానికి చెందిన ప్రవాస భారతీయురాలు చావ పద్మిని మాట్లాడుతూ.. తన వంతుగా ఏదైనా సాయం చేయాలనే ఉద్దేశంతో దుస్తులు, పాదరక్షాలు, బ్రెడ్ అందించినట్లు తెలిపారు. చేతన ఫౌండేషన్ సభ్యులు దొడ్డా సీతారామయ్య, హెచ్ఎం అంజయ్య, భూక్యా సత్తులాల్, చంద్రకాని, నవీన్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

సమాన వేతనమివ్వాలి

అశ్వాపురం: రాష్ట్రంలో పని చేస్తున్న 3,874 మంది ఉపాధి హామీ సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఉపాధి హామీ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావును మణుగూరులో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొడిమెల్ల వెంకటేష్, మణుగూరు ఏపీఓ ఉదయశ్రీ, టెక్నికల్ అసిస్టెంట్లు ప్రసాద్, కాంతారావు, కంప్యూటరు ఆపరేటర్లు సుతారి గోపాల్, కొమ్మిడి భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీ పరామర్శ

అశ్వాపురం: మండల పరిధిలోని అమెర్ద గ్రామ పంచాయతీలోని అంబేడ్కర్‌నగర్ గ్రామానికి చెందిన తోకల వెంకటేశ్వర్లు కుమారుడు నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా.. మంగళవారం ఆ కుటుంబాన్ని వైస్ ఎంపీపీ కంచుగట్ల వీరభద్రం, మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గద్దల నాగేశ్వరరావు పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు. బీఆర్ఎస్ మండల యువజన అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు జూపల్లి కిరణ్, డేవిడ్, కన్నెబొయిన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కదలిక లేని కొత్త పంచాయతీలు

- సారపాకలో రెండు, భద్రాచలంలో మూడు నూతన జీపీలు
- ఏర్పాటుకు ఉత్తర్వులున్నా ముందుకు కదలని ప్రక్రియ
- ఊసేలేని పంచాయతీల సిబ్బంది నియామకం



సారపాక గ్రామపంచాయతీ

బూర్గంపాడు: పారిశ్రామిక ప్రాంతమైన సారపాక మేజర్ గ్రామపంచాయతీని రెండు గ్రామపంచాయతీలుగా, పవిత్ర పుణ్యక్షేత్రమైన భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీని మూడు గ్రామపంచాయతీలుగా విభజిస్తు గత డిసెంబర్ 16న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత అసెంబ్లీ సమావేశాలలో పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుకు రాష్ట్ర శాసన సభ ఆమోదం తెలిపింది. సారపాక మేజర్ గ్రామపంచాయతీని సారపాక, ఐటీసీ గ్రామపంచాయతీలుగా విభజిస్తు శాసనసభ ఆమోదం తెలిపింది. అయినప్పటికీ ఆ ప్రక్రియ ప్రస్తుతం మౌనంగా ఉంది.

భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీని భద్రాచలం, శాంతినగర్, సీతారాంనగర్ గ్రామపంచాయతీలుగా విభజించింది. ఈ రెండు మేజర్ గ్రామపంచాయతీలను మున్సిపాలిటీలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ల క్రితం ప్రతిపాదనలు చేసింది. అయితే ఏజెన్సీ చట్టాలు, కోర్టు వ్యవహారాల నేపథ్యంలో మున్సిపాలిటీ ప్రతిపాదనలను ప్రభుత్వం విరమించుకుంది. ఈ క్రమంలోనే మేజర్ గ్రామపంచాయతీలను పరిపాలన సౌలభ్యం కోసం చిన్న పంచాయతీలుగా విభజించింది. భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీని మూడు గ్రామపంచాయతీలుగా విభజించటాన్ని భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య తీవ్రంగా వ్యతిరేకించారు. విభజన ఉత్తర్వులను రద్దు చేయాలని ప్రభుత్వానికి, రాష్ట్ర గవర్నర్‌కు ఆయన విన్నవించారు.
భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీని మూడు జీపీలుగా విభజించవద్దని స్థానికంగా ప్రజాసంఘాలు, రాజకీయపార్టీలు కూడా ఆందోళనలు చేశాయి. భద్రాచలం పుణ్యక్షేత్ర ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలని, లేకుంటే మేజర్ గ్రామపంచాయతీగా ఉంచాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇదే తరుణంలో సారపాక మేజర్ గ్రామపంచాయతీని రెండు గ్రామపంచాయతీలుగా కాకుండా అదనంగా మరో రెండో గ్రామపంచాయతీలుగా విభజించాలనే డిమాండ్ వినిపిస్తోంది. భాస్కర్‌నగర్, చంద్ర పుల్లారెడ్డినగర్‌లను ప్రత్యేక గ్రామపంచాయతీగా చేయాలని కొందరు డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా పారిశ్రామిక వాడలు ఎక్కువగా ఉన్న గాంధీనగర్, రాజీవ్‌నగర్, విజయ్‌నగర్, ఒడియాక్యాంపును గ్రామపంచాయతీగా గుర్తించాలనే డిమాండ్ వినిపిస్తుంది.

నెలన్నర క్రితం కొత్త గ్రామపంచాయతీలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం కూడా తెలిపింది. అయితే కొత్త గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసి పరిపాలన చేపట్టే చర్యలు ఆలస్యమవుతున్నాయి.

కొత్త గ్రామపంచాయతీలకు కార్యాలయాలు గుర్తించి పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. ఈ చర్యలపై ఎలాంటి కదలిక లేకపోవటంతో కొత్త పంచాయతీల ఏర్పాటు ప్రక్రియ స్తబ్దుగా ఉంది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కొత్త గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసి పరిపాలన సాగించాలని పలువురు కోరుతున్నారు. అదేవిధంగా కొత్త గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించి పాలకవర్గాలను ఎన్నుకోవాలని పలువురు కోరుతున్నారు.

కొత్త పంచాయతీలు ఏర్పాటు చేయాలి



ప్రభుత్వం కొత్త గ్రామపంచాయతీలను తక్షణమే ఏర్పాటు చేయాలి. పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం చిన్న పంచాయతీలను ఏర్పాటు చేయటం మంచి పరిణామమే. సమస్యల పరిష్కారానికి చిన్న పంచాయతీలలో అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కొత్త పంచాయతీల నుంచి తొందరగా పాలన ప్రారంభించాలి.

– రెడ్డెం బాలిరెడ్డి, సారపాక

తక్షణమే ఎన్నికలు నిర్వహించాలి



ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన గ్రామపంచాయతీలకు తక్షణమే ఎన్నికలు నిర్వహించి పాలకవర్గాలను నియమించాలి. సారపాక గ్రామపంచాయతీకి నాలుగున్నర ఏళ్లుగా పాలకవర్గం లేదు. దీంతో సమస్యల పరిష్కారానికి తీవ్ర జాప్యం ఏర్పడుతోంది. గ్రామ పంచాయతీ ఎన్నికల జాప్యంతో మండల పరిషత్ ఎన్నికలు కూడా ఆలస్యం అమవుతున్నాయి.

– రాయల దుర్గారావు, భాస్కర్‌నగర్

దళితబంధుతో కొత్తకాంతులు



దుమ్ముగూడెం: అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న రేగా కాంతారావు

మణుగూరుటౌన్: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన దళితబంధు పథకంతో దళితుల జీవితాల్లో కొత్త వెలుగులు నిండుతున్నాయని తెలంగాణ ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. మంగళవారం మణుగూరు మండలం సమితిసింగారంలో కోదాడ శివ కేశవులు మొదటి విడత దళిత బంధులో భాగంగా తొలుత అశోక్‌లైలాండ్ వాహనం కొనుగోలు చేయగా మిగిలిన సొమ్ముతో టైలరింగ్ షాపు ఏర్పాటు చేయడంతో దాన్ని ప్రారంభించి ప్రసంగించారు. దళితుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపడంతోపాటు భావితరాలకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. ఈ పథకం దళితులను ఆర్థికంగా మరింత అభివృద్ధి చేస్తుందన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పినపాక నియోజకవర్గంలో దళితబంధు వల్ల లబ్ధిదారులు ఎంతో ఆర్థిక అభివృద్ధి సాధించారని చెప్పడానికి శివకేశవులు నిదర్శనంగా నిలిచారన్నారు. అందరూ ఈ విధంగా సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నర్సింహా రావు, బీఆర్ఎస్ నేతలు ముత్యం బాబు, అప్పారావు, నవీన్ బాబు, ప్రభుదాస్, మేకల రవి, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సమష్టిగా పనిచేయండి

దుమ్ముగూడెం: మండలంలో ప్రతి కార్యకర్తా బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధికి సమష్టిగా పనిచేయాలని, ప్రతి కార్యకర్తా అండగా ఉంటామని పినపాక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. మంగళవారం మండల కేంద్రం లక్ష్మీనగరంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీలో అందరం కలిసి పనిచేద్దాం.. పార్టీ గెలుపునకు కృషి చేద్దాం అన్నారు. పార్టీకి కార్యకర్తలే కొండంత అండ అని కార్యకర్తకు ఎటువంటి కష్టమొచ్చినా ఆదుకుంటామని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజలకు తెలిసే విధంగా ప్రచారం చేయాలని, మండలంలో జరగబోయే ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు. పార్టీ కార్యాలయంలో కొందరు ఆయన దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలకు ఫోన్ ద్వారా అధికారులకు తెలిపి సమస్యను పరిష్కారం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రేసు లక్ష్మి, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు అన్నె సత్యనారాయణమూర్తి, కణితి రాముడు,నాయకులు జానిపాషా, తునికి కామేష్ , దామెర్ల శ్రీనివాసరావు, మోతుకురి శ్రీకాంత్, ఎంపీటీసీ తునికి సీత పాల్గొన్నారు.

మిఠాయిలు పంపిణీ చేయాలి

మణుగూరుటౌన్: కార్మికుల సమష్టి కృషితో ఏరియా నిర్దేశిత లక్ష్యాలు సాధించిన కార్మికులకు మిఠాయిలు పంపిణీ చేయాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం బ్రాంచ్ ఉపాధ్యాక్షుడు వి.ప్రభాకర్‌రావు ఏరియా జీఎం దుర్గం రాంచందర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2022–23 వార్షిక లక్ష్యం 116లక్షల టన్నులకుగాను 118.87లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయడంతోపాటు 126.66 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసి సరికొత్త రికార్డు సృష్టించిన మణుగూరు ఏరియా కార్మికులకు ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. కూనవరం రైల్వేగేట్ దగ్గర ఉన్న సింగరేణి కార్మికుల లోగోని మల్లారం రైల్వేగేట్ చౌరస్తాలో ఏర్పాటు చేయాలన్నారు. కార్మిక నివాస కాలనీల్లోని అంతర్గత రోడ్లు నిర్మించాలని, అంబేడ్కర్ సెంటర్‌లో ఓపెన్ జిమ్ పనులు, సీఈఆర్ క్లబ్‌లో జిమ్ పరికరాల ఏర్పాటు వేగవంతం చేయాలని కోరారు.

ఏరియాలోని అండర్ గ్రౌండ్ జనరల్ మజ్దూర్లకు సర్ఫేస్ పదోన్నతుల ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. కొండాపురం భూగర్భగనిలో ష్లేడేల సంఖ్య పెంచాలని, ఏరియాలోని కార్మిక సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కేంద్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ అబ్దుల్ రవూఫ్, బ్రాంచి నాయకులు వీరభద్రయ్య, కపా శివాజీ, ఎస్వి ఎస్ వర్మ, బానోత్ కృష్ణ, మునిగెల రమేష్, అశోక్, కొండాపురం గని పిట్ సెక్రటరీ నాగేల్లి వెంకట్‌లు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల్లో తనిఖీ



మణుగూరురూరల్: పరీక్ష కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న సీఐ ముత్యం రమేష్

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని పదో తరగతి పరీక్ష కేద్రాలలో మంగళవారం భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ తనిఖీ చేశారు. కేంద్రాలలో విద్యార్థుల కోసం చేసిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బందులు కలిగినా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే ఎక్కడ కూడా మాస్ కాపియింగ్‌కు అస్కారం లేకుండా పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కాపియింగ్‌కు పాల్పడితే మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో వరుస పదో తరగతి పరీక్ష పత్రాల లీకేజీ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో ఏఎస్పీ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలుస్తోంది.

మణుగూరురూరల్: మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు ఆదేశాల మేరకు మండలంలోని పది పరీక్షా కేంద్రాలను మణుగూరు సీఐ ముత్యం రమేష్ మంగళవారం సందర్శించి పరీక్షల నిర్వహణను తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ, అసౌకర్యం కలగకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పటిష్ఠంగా బందోబస్త్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు రాజ్‌కుమార్, పురుషోత్తం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వేలంపాట ఖరారు

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రం పర్ణశాల పంచాయతీలో గోదావరిలో నిర్వహించే బోటు షికార్ వేలం పాట ఖరారు అయ్యింది. మంగళవారం సర్పంచ్ తెల్లం వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన వేలాం పాటలో నలుగురు పాట దారులు పాల్గొనగా నవలం భద్రయ్య హెచ్చుపాట రూ.20లక్షల 10 వేలకు పాటను దక్కించుకున్నాడు. ఏప్రిల్ 1, 2023 నుంచి ఏప్రిల్ 1, 2024 వరకు పాటదారుడు గోదావరిలో బోటు షికారు నిర్వహించుకునేందుకు అవకాశం ఉంది. గతేడాది రూ.15లక్షల 15 వేలకు పాట కాగా ఈ ఏడాది అదనంగా పంచాయతీకి రూ.4లక్షల 95 వేలు వచ్చింది. ఈ వేలం పాటలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ రెడ్డి, ఉప సర్పంచ్ వాగే ఖాదర్ బాబు, వార్డ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నిర్వహించాలి

అశ్వాపురం: పినపాక నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుల ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయాల్లో నేడు బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ పినపాక నియోజకవర్గ అధ్యక్షుడు అశోక్‌కుమార్ ఓ ప్రకటనలో కోరారు.

ఆర్థిక సాయం

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీ అశోక్‌నగర్‌కు చెందిన పుల్లమ్మ అనే వృద్ధురాలు సోమవారం రాత్రి మరణించగా.. సామాజిక కార్యకర్త బుద్దరాజు నవీన్‌బాబు మంగళవారం మృతదేహాన్ని సందర్శించి నివాళ్లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి దహన సంస్కారాల నిమిత్తం రూ.5 వేలను సాయంగా అందజేశారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి



ఏపీఎంకు డిమాండ్ల పత్రాన్ని అందిస్తున్న వీఓఏలు

బూర్గంపాడు: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని ఐకేపీ వీఓఏలు ఆందోళన చేపట్టారు. బూర్గంపాడు ఐకేపీ కార్యాలయంలో మంగళవారం ఆందోళన చేపట్టిన వీఓఏలు తమ డిమాండ్ పత్రాలను ఏపీఎం నాగార్జునకు అందజేశారు. ఈ సందర్భంగా వీఓఏల సంఘం అధ్యక్షురాలు శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. వీఓఏలకు రూ.26 వేల కనీస వేతనం ప్రకటించాలని, రూ.10లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెల 16వ తేదీ వరకు ఆన్‌లైన్ పనులను నిలిపివేస్తున్నామని, సమస్యలు పరిష్కరించకుంటే ఏప్రిల్ 17 నుంచి సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఆందోళన కార్యక్రమంలో సంఘ కార్యదర్శి ఎస్డీ ఖాసీంబీ, కోశాధికారి పోశమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొలతలు అనుసరించండి



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ మంగమ్మ

గుండాల: ఉపాధి హామీ పనుల్లో కూలీలు కొలతల ప్రకారం పనులు చేయాలని ఆళ్లపల్లి ఎంపీడీఓ మంగమ్మ అన్నారు. ఆళ్లపల్లి మండలంలో మర్కోడు పంచాయతీ గ్రామాల్లో వంద రోజుల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 3 మీటర్ల పొడవు, 2 మీటర్ల వెడల్పు, 0.3 ఫీట్ లోతులో మట్టి తీయాలన్నారు. ఈ పనికి రూ.272లు జమ అవుతాయని తెలిపారు. కూలీలందరికీ పనులు కల్పించాలని కింది స్థాయి సిబ్బందిని సూచించారు. ఏపీఓ రఘునాథ్, ఈసీ అప్పారావు, టీఏ క్రిష్టారావు, కంప్యూటర్ ఆపరేటర్ వీరస్వామి, కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీపై వినతి

అశ్వాపురం: రైతుల రుణాలు మాఫీ, కౌలు రైతులకు రైతుబంధు, ఇన్సూరెన్స్, పంట నష్టపరిహారం తదితర డిమాండ్లతో తెలంగాణ జన సమితి పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ ఎంఏ.రాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల కరుణాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సురకంటి ప్రభాకర్‌రెడ్డి, పిప్పాల శ్రీనివాస్, రైతులు వీరన్న, శైలజ, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీని సందర్శించిన నాయకులు



ఫ్యాక్టరీ మేనేజర్‌తో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

దమ్మపేట: మండల కేంద్రంలోని అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీని మండల ప్రజాప్రతినిధులు, రైతు సంఘం నాయకులు మంగళవారం సందర్శించారు. ఫ్యాక్టరీలో జరుగుతున్న విస్తరణ పనులను పరిశీలించారు. అనంతరం ఫ్యాక్టరీ మేనేజరుతో భేటి అయ్యారు. ఈ సందర్భంగా మేనేజరు కల్యాణ్ మాట్లాడుతూ.. ఈ నెల 10వ తేదీ నుంచి ఫ్యాక్టరీ 60 టన్నుల సామర్థ్యంతో ప్రారంభమవనున్నట్లు తెలిపారు. ఫ్యాక్టరీ నుంచి వచ్చే మురుగు నీటిని శుభ్రపరిచే ప్లాంట్ నిర్మాణ పనులను 30 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్నామని తెలిపారు. గెలల దిగుమతికి వచ్చే రైతుల ట్రాక్టర్లకు ప్రత్యేక సీరియల్ నంబర్లను కేటాయించి, 2 ఎకరాలలో పార్కింగ్ స్థలం ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ఆయిల్‌పామ్ రాష్ట్ర అధ్యక్షుడు అలపాటి ప్రసాద్, జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, రాష్ట్ర సభ్యులు దారా యుగంధర్, ఆళ్ళ జంగం తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.30 లక్షలు ఇవ్వాలి

దుమ్ముగూడెం: సీతమ్మ సాగర్ ప్రాజెక్టుకు భూమి అవసరం అయితే ఎకరాకు రూ.30 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని సీతమ్మ సాగర్ ప్రాజెక్టు భూ నిర్వాసితుల అధ్యక్షుడు కొమరం దామోదరరావు డిమాండ్ చేశారు. మంగళవారం సీతమ్మ సాగర్ ప్రాజెక్టు 2వ భూసేకరణపై రైతులతో మాట్లాడేందుకు మండల తహసీల్దార్ చంద్రశేఖర్ రాగా.. వారికి నిరాశ ఎదురైంది. సీతమ్మ సాగర్ ప్రాజెక్టు భూ నిర్వాసితులు ఎకరాకు 30 లక్షలు ఇవ్వాలని, అసలు భూసర్వే జీవీఆర్ కంపెనీ ప్రతినిధులు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. అసలు ప్రభుత్వం ప్రజల వద్ద ప్రాజెక్ట్ విషయంపై సరైన క్లారిటీ ఎందుకు ఇవ్వటం లేదో చెప్పగలరా! అని నిలదీశారు. ప్రాజెక్టు డీపీఆర్‌ను ప్రజల ముందుంచి ప్రజల అనుమానాలను నివృత్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో తుష్టికామరాజు, పొడియం సురేష్, పొడియం వెంకటరమణ,వాగెఖాదర్ బాబు, గోపమ్మ,సమ్మక్క, వాడె చలపతి, ముత్యాలమ్మ, ఆర్ఐ ఆదినారాయణ, సర్వేయర్ నర్సయ్య, వీఆర్ఏ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలని దీక్ష



ఇళ్ల స్థలాల కోసం దీక్ష చేస్తున్న గిరిజనులు

అశ్వారావుపేటరూరల్: నిరుపేదలైన తమకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని కొంతమంది గ్రామస్తులు మంగళవారం ఆందోళన చేపట్టారు. మండల పరిధిలోని వినాయకపురం కాలనీ సమీపంలోని యర్రగుంటపల్లికు చెందిన గిరిజనులు ఇళ్ల స్థలాలను ఇవ్వాలనే డిమాండ్‌తో నిరసన దీక్షకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ సమీపంలోని సర్వే నంబర్లు 345/1/10, 307లో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని చెప్పిన అధికారులు కాలయాపన చేస్తున్నారని, గడిచిన కొద్ది నెలలుగా తాము ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు దీక్ష కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు సరియం వెంకటేశ్వరరావు, సరియం ముత్తేశ్వరరావు, తెల్లం రాముడు, సరియం వెంకన్నబాబు, కె.వీరభద్రం, సోడెం కనకరాజు, కె.లక్ష్మయ్య పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు



ఎంపీపీ శ్రీరామ్మూర్తిపై వాగ్వాదానికి దిగిన వైస్ ఎంపీపీ ఫణీంద్ర

అశ్వారావుపేట: వేసవిలో ఏ ఒక్క గ్రామంలో కూడా తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చూడాలని అశ్వారావుపేట శాసనసభ్యుడు మెచ్చా నాగేశ్వరరావు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన తాగునీటి సరఫరాపై సమీక్షలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 10 నుంచి గ్రామపంచాయతీలకు నిధులు రానున్నాయని.. గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా సర్పంచ్‌లు, కార్యదర్శులు, మిషన్ భగీరథ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తమ పంచాయతీల్లో చిన్న చిన్న మరామత్తులు చేపట్టేందుకు నిధుల్లేవని.. నిధులున్నా అధికారులు ఎంబీ రికార్డు చేయడం లేదని పలువురు సర్పంచ్‌లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అధికారుల వైఫల్యాన్ని సర్పంచ్‌లతోపాటు మామిళ్లవారిగూడెం కార్యదర్శి రాంబాబు సైతం దుయ్యబట్టారు. గ్రామాల్లో ప్రజలు రాస్తారోకో నిర్వహిస్తున్నా.. మిషన్ భగీరథ సిబ్బంది కనీసం ఒక్కసారయినా క్షేత్రస్థాయి పరిశీలనలు చేశారా అంటూ గ్రిడ్ డీఈఈ అభిషేక్‌ను నిలదీశాలు. గోదావరి నీళ్ల పంచాయతీలకు ఏ సమయంలో సరఫరా చేస్తారో తెలియడం లేదని వాపోయారు. మిషన్‌భగీరథ సిబ్బంది పనితీరుపై ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేయగా.. ఎమ్మెల్యే మిన్నకుండిపోవడం కాకుండా ఇక చాలు ఆగండి.. అధికారులు పనులు చేస్తానంటున్నారుగా.. చేస్తారు లెండి అంటూ సముదాయించారు. దీంతో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మమ్మల్ని ఎందుకు సమావేశానికి పిలిచినట్లోనని అసహనం వ్యక్తం చేశారు.

సర్పంచ్‌ల స్థానంలో హాజరైన భర్తలు..

ప్రజాప్రతినిధులు వారి గళాన్ని వినిపించాల్సిన సమావేశానికి వారి భర్తలు హాజరయ్యారు. మొద్దులమడ సర్పంచ్ కొర్సా రాములమ్మకు బదులుగా భర్త చిరంజీవి గాండ్లగూడెం సర్పంచ్‌కు భూక్యా చిలకమ్మకు బదులుగా భూక్యా ప్రసాద్, వినాయకపురం సర్పంచ్ పొడియం సత్యవతికి బదులుగా పొడియం వెంకటేశ్వరరావు సమావేశానికి హాజరయ్యారు. వీరిలో తాను మొద్దులమడ సర్పంచ్‌ను అంటూ సమావేశంలో పంచాయతీ సమస్యలను సర్పంచ్ భర్త ఏకరువు పెట్టాడు. అయినా అధికారులు, వేదిక మీద ఎమ్మెల్యే సహా విషయాన్ని గమనించకుండా ఆయన చెప్పింది ఎంచక్కా వింటున్నారు. అధికారిక సమావేశానికి ఎవరు హాజరు అవుతున్నారు.? ఎంత మందికి ఆహ్వానం పంపారు.? ఎంతమంది వచ్చారు..? వచ్చిన వారిలో సమావేశంలో మాట్లాడేందుకు అర్హులెవరనే విషయాన్ని మండల పరిషత్ అధికారులు గాల్లోకొదిలేశారని స్పష్టమవుతోంది.

ఎంపీపీపై వైస్ ఎంపీపీ ఫైర్..

కాగా సమావేశానికి తనను మండల పరిషత్ కార్యాలయం నుంచి ఎవరూ ఆహ్వానించలేదని వైస్ ఎంపీపీ చిట్టూరి ఫణీంద్ర ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బూతులు తిడుతూ మీదకు వెళుతుండటంతో సత్యవరపు సంపూర్ణ, తదితర బీఆర్ఎస్ నాయకులు అడ్డుకుని శాంతింపజేశారు. సమావేశంలో ఎంపీడీఓ విద్యాధర్, ఎంపీఓ సీతారామరాజు, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.